క్లుప్తంగా

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



పరకాల : పరకాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఎన్నికయిన సీనియర్ న్యాయవాది ఒంటేరు చంద్రమౌళిని స్నేహ సహకార వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రమౌళిని అసోసియేషన్ నాయకులు, సభ్యులు పూలమాలలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్ల శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రంగు పూర్ణచందర్, కోశాధికారి చిలుకమారి సదానందం, ప్రముఖ వైద్యుడు కె.నవీన్‌కుమార్, శ్రీనివాస్, భద్రయ్య, వెంకన్న, కుమారస్వామి, సదానందం, వెంకట్రాజం తదితరులు పాల్గొన్నారు.

దళితరత్న అవార్డు గ్రహీతకు..



ఐనవోలు : ఇటీవల దళితరత్న అవార్డును అందుకున్న అందుకున్న సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి మిద్దెపాక రవీందర్‌ను కొండపర్తి గ్రామానికి చెందిన ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడారు. దళితులకు రాజ్యాధికారం సాధించడం కోసం ఐక్య పోరాటాలు కొనసాగించాలని సూచించారు. దళితులు చైతన్యవంతులై జాతి అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు పిట్టల సుధీర్, సొసైటీ వైస్ చైర్మన్ మాదాసి బాబు, సర్పంచ్ కట్కూరి రాజమణి, ఆత్మ కమిటీ జిల్లా డైరక్టర్ కట్కూరి రాజు, నాయకులు బెన్సన్, శ్రీ రామోజు సతీశ్, సింగారపు విజయ్‌భాస్కర్, అబ్బాస్ అలీ, స్వామి, అశోక్, అశోక్‌రావు, శేఖర్, వెంకన్న, ప్రభాకర్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు కొంగర లక్ష్మీ, కొంగర చేరాలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాలకు స్థానిక సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి ఆదివారం రూ.2 వేలు చొప్పున ఆర్థికసాయం అందించారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. రోడ్డు ప్రమాదంలో పేద కూలీలు మృతి చెందడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోతుగంటి సరోజన మల్లయ్య, వార్డు సభ్యులు అంకేశ్వరపు కుమారస్వామి, దుబాసి కృష్ణమూర్తి, కొంగర జగన్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత



ఎల్కతుర్తి : మండలంలోని జీల్గుల గ్రామానికి చెందిన ముడికె కొమురమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి బీజేపీ నేత, హౌజ్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ఆదివారం 50 కిలోల బియ్యం సాయంగా అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ అనుబంధ గొర్లకాపర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు ముష్కె వెంకటేశ్, బూత్ కమిటీ అధ్యక్షుడు రావుల సంపత్, నాయకులు తిరుపతి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి

విద్యారణ్యపురి: ప్రభుత్వ కళాశాలల్లోని కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూల్యాంకనం చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా డీఐఈఓ గోపాల్‌కు కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ బాధ్యులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్, నాయకులు పాతూరి రాజిరెడ్డి, హరగోపాల్, గణపతి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

కాజీపేట: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సెంట్రింగ్ మేస్త్రీ పాలడుగుల రమేష్ కుటుంబానికి ఆటో యూనియన్ నాయకులు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. శ్రీస్వామి వివేకానంద గృహ నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగుల శివకుమార్, గౌరవ అధ్యక్షుడు ఎర్ర రాజు, ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజు, రాజారపు స్వామి తదితరులు పాల్గొన్నారు.

యాసంగి వరికోతలు షురూ



ధాన్యాన్ని కోసి ట్రాక్టర్‌లో పోస్తున్న యంత్రం

ఎల్కతుర్తి : మండలంలో యాసంగి వరికోతలు షురువయ్యాయి. యాసంగి ధాన్యం కొంటామంటూ ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. రైతులు సాగు చేసిన వరి పంటలు కోత దశకు చేరుకున్నాయి. ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి అక్కడక్కడ వడ్లు నేలరాలి కొంత నష్టం వాటిల్లినా అధిక శాతం పంట బాగానే ఉంది. ముందుగా వేసిన వరిపంట కోత దశకు చేరుకోగా రైతులు యంత్రాల సహాయంతో కోతలు మొదలు పెట్టారు.

కోతదశకు చేరిన వరి

మండలవ్యాప్తంగా మొత్తం 17 వేల 400 ఎకరాల్లో వరి పంట సాగు నమోదైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అందులో 5వేల 600 ఎకరాల్లో ఆడ, మగ వరి సాగు చేయగా మిగతా భూమిలో సాధారణ వరి రకాలను రైతులు సాగు చేశారు. ఆడ, మగ వరి పైర్లు సైతం కోతదశకు చేరుకుంటున్న పరిస్థితి కనపడుతోంది. ప్రస్తుతం ముందుగా సాగు చేసిన సాధారణ వరి రకాలు కోత కొచ్చాయి. రెండ్రోజుల క్రితం కురిసిన మోస్తరు వర్షానికి పంట పొలాలు దిగబడుతుండడంతో రైతులు అక్కడక్కడా చైన్ యంత్రాల ద్వారా వరి పైర్ల కోతలు మొదలుపెట్టారు.

భూగర్భ జలాలు పుష్కలం

ట్రాక్ మిషన్ గంటకు రూ.3 వేలు, టైర్ మిషన్ గంటకు రూ.2 వేలు అద్దె చెల్లించాల్సి వస్తోంది. మండలంలో మొత్తం 19 గ్రామ పంచాయతీలు, వాటికి 4 అనుబంధ గ్రామాలున్నాయి. ఎస్సారెస్పీ కాల్వ దిగువ 9 గ్రామాలు ఉండగా వీటి పరిధిలో పూర్తిగా వరిపంట సాగు చేశారు. ఎస్సారెస్పీ ఎగువన 10 గ్రామ పంచాయతీలు మెట్ట ప్రాంతంలో ఉన్నాయి. వీటి పరిధిలో 30 శాతం ఆరుతడి పంటలు సాగు చేశారు. ఎస్సారెస్పీ కాల్వ నుంచి నీళ్లు పుష్కలంగా వస్తుండడంతో బావులు భూగర్భ జలాల నీటిమట్టం పెరిగింది. అలాగే ధర్మసాగర్ రిజర్వాయర్ ఎడమ కాల్వ ఆయకట్టులో వరి సాగు చేశారు. ఇందులో హైబ్రిడ్ సీడ్ రకం పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. ఈ పంటలు సైతం మరో 10 రోజుల్లోగా కోతలకు సిద్ధం కానున్నాయి.

వాతావరణంలో మార్పులతో..



వాతావరణంలో రోజురోజుకు మార్పులు చోటు చేసుకుంటుండడంతో ఆందోళన తప్పడం లేదు. కోసిన ధాన్యాన్ని ఆరబోసేందుకు స్థలాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గత్యంతరం లేక రహదారులపైనే ధాన్యాన్ని ఆరబోయాల్సి వస్తోంది.

- కొమ్మిడి పుల్లారెడ్డి, రైతు ఎల్కతుర్తి

కొనుగోళ్లు ప్రారంభించాలి



వరికోతలు ప్రారంభమైన నేపథ్యంలో వాతావరణ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి. ఆలస్యం చేయకుండా ఖాతాల్లో డబ్బు జమ చేయాలి. ధాన్యంలో కోత విధించకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలి.

- నల్లాల శ్యాంసుందర్‌రెడ్డి, రైతు

కేసీఆర్ పాలనలో అభివృద్ధి శూన్యం

● టీపీసీసీ సభ్యుడు సత్యనారాయణరావు



ప్రజలతో మాట్లాడుతున్న సత్యనారాయణరావు

శాయంపేట : సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమని టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని నేరేడుపల్లి, అప్పయ్యపల్లి, గొల్లపల్లి, ప్రగతి సింగారం, అరెపల్లి గ్రామాల్లో ఆదివారం 'హాథ్ సే హాథ్ జోడో' యాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం రోడ్‌షోలో సత్యనారాయణరావు మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలుక, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాలు చొప్పున భూపంపిణీ, తదితర అనేక హామీలు ఇచ్చి ఓట్లు దండుకుని సీఎంగా కేసీఆర్ గద్దెనెక్కి తదనంతరం ప్రజలను విస్మరించారని విమర్శించారు. కేసీఆర్ మోసపూరిత మాటలు నమ్మి ప్రజలు రెండు సార్లు అధికారం కట్టబెడితే పేదలు మరింత దారిద్ర్యంలోకి నెట్టబడగా సంపన్నులు మరింత సంపన్నులయ్యారంటూ రైతుబంధు కింద భూస్వాములకు రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఇవ్వడాన్ని ఉదహరించారు. కాంగ్రెస్ హయాంలోనే సుపరిపాలన అందిందని చెప్పారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, తదితర అనేక పథకాల ద్వారా లబ్ధి చేకూర్చినట్టు గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రజలను దోచుకోవడమే పనిగా భారాలు మోపుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాకాంక్షను గౌరవించి పార్టీ అధినేత్రి సోనియాగాంధీ చొరవ తీసుకుని తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేయాలని ఆకాంక్షించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి భూకబ్జాలకు, అక్రమాలకు పాల్పడి వందల కోట్ల రూపాయలు కూడబెట్టుకున్నాడని, రానున్న ఎన్నికల్లో గండ్ర వెంకటరమణారెడ్డి ఓడిపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు మారెపెల్లి బుజ్జన్న, నిమ్మల రమేష్, మిట్టపల్లి సతీష్, మారెపెల్లి కట్టయ్య, మడికొండ రాజు, భాస్కర్, గోవరబోయిన పైడి, వైద్యుల ఆదిరెడ్డి, పోలెపల్లి అశోక్, మెతుకు సాంబరెడ్డి, నాగవెల్లి రత్నాకర్, మదాసి సతీష్, వైద్యుల వెంకట్‌రెడ్డి, చెల్పూరి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా కన్వీనర్‌గా నీరజ



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పులి నీరజను బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) సిద్దిపేట జిల్లా మహిళా కన్వీనర్‌గా నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీన్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో నీరజ మాట్లాడారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి పాటుపడతానని చెప్పారు. తన నియమకానికి కృషి చేసిన రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మీయ కుటుంబాల సందడి



ధర్మసాగర్ : హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్ 1983 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు ఆత్మీయ కుటుంబాల సమ్మేళనం కార్యక్రమాన్ని భీమారంలోని తులసీ గార్డెన్‌లో ఆదివారం ఉల్లాస భరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో, వివిధ దేశాల్లో స్థిరపడిన మిత్రులు 40 ఏళ్ల తర్వాత కలుసుకొని పాఠశాల సమయంలో వారు గడిపిన అనుభూతులను గుర్తు చేసుకున్నారు. స్నేహాన్ని కలకాలం కొనసాగించాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతున్న నాటి మిత్రులను గుర్తించి ఆత్మీయంగా అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. తదనంతరం వివిధ అంశాల్లో క్రీడాపోటీలు నిర్వహించి సామూహిక భోజనాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో నాటి విద్యార్థులు బాలకిషన్, ధర్మప్రకాష్, కె.వి.గోపాల్, అంకం సతీశ్‌కుమార్, ఈశ్వర్ సింగ్, రాజేందర్, విజయ్, శివారెడ్డి, నర్సింహారెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



కమలాపూర్ : రన్ ఫర్ జీసస్‌లో క్రైస్తవులు

కమలాపూర్ : మండలంలోని శనిగరం గ్రామంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ కార్యక్రమం చేపట్టి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రార్థనలు చేసి సమస్త మానవాళి సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో సంఘ కాపరి ఎస్.క్రిస్టఫర్, అధ్యక్షుడు బెంజిమెన్, కార్యదర్శులు క్రిస్టఫర్, కుమార్ దాస్, పురుషోత్తం, సదయ్యగౌడ్, మహిళా కార్యదర్శులు సంపూర్ణ, పద్మ, సుమలత, శ్రీలత, ప్రసన్న, చంద్రకళ, ప్రవళిక, లావణ్య, సంపూర్ణ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



దామెర : ప్రార్థన చేస్తున్న ఫాదర్, భక్తులు

దామెర : మండలంలోని ఊరుగొండ గ్రామంలోని పునీత తేరెజమ్మ దేవాలయంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. విచారణ గురువు ఫాదర్ గంగారపు సురేశ్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ సురేశ్ మాట్లాడారు. ఎవరు కూడా నమ్మిన వారిని మోసం చేయవద్దని సూచించారు. ప్రతిఒక్కరూ అహం వీడి ప్రేమతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మొగిలి, ఫ్రాన్సిస్, జన్ను కుమారస్వామి, జన్ను సాంబయ్య, ఐత రమేశ్, పాలెపాక స్వామి, అక్కెల్ల రాణి, జన్ను రూప, కోమల, ప్రశాంత్, రమేశ్, శ్రీకాంత్, వినయ్ పాల్గొన్నారు.

ప్రాయశ్చిత్తానికి మించిన పరిహారం లేదు

● ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

ధర్మసాగర్ : ప్రాయశ్చిత్తానికి మించిన పరిహారం లేదని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య తెలిపారు. హింస, ద్వేషాలు మరణాన్ని మాత్రమే ఇస్తాయని.. ప్రేమ, క్షమాపణలు జీవితానికి నూతనత్వాన్ని ఇస్తాయని చెప్పారు. ఈ విషయాన్ని నిరూపించడానికే సమాధి నుంచి ఏసుక్రీస్తు సజీవుడై తిరిగి వచ్చాడని ఆయన స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని రిజర్వాయర్ వద్ద ఉన్న గుట్టపై సహాయమాత పుణ్యక్షేత్ర ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. తొలుత ఆలయాన్ని ప్రారంభించి వరంగల్ బిషప్ ఉడుముల బాలతో కలిసి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడారు. ఏసుక్రీస్తు జనుల పాపముల పరిహారం కోసం సిలువపై మరణించి సమాధి చేయబడ్డాడని చెప్పారు. మరణాన్ని జయించిన వారు ఎవరూ లేరని, ఏసుక్రీస్తు సమాధి మాత్రమే ఇప్పటికీ తెరువబడి యున్నదని తెలిపారు. ఏసుక్రీస్తు మాత్రమే మరణాన్ని జయించి తిరిగి లేచాడన్నారు. "పునరుత్థానమును, జీవమును నేనే.. నా యందు విశ్వాసము ఉంచు వారు చనిపోయినను బ్రతుకుదురు" అని ఏసుక్రీస్తు పలికిన దివ్యవచనలను విశ్వాసుల ఎదుట ఉంచాడు. దేవుని బిడ్డలందరూ దేవుని యందు విశ్వాసంతో ఉండవలెనని, బైబిల్ అనుసరణీయమైన జీవితాన్ని గడపాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మసాగర్ గురు నిలయం విచారణ గురువు ఫాదర్ జోసెఫ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గంగారపు అమృతరావు, సహాయమాత దేవాలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డు ప్రభుదాస్, ఎంపీటీసీలు బొడ్డు శోభ, జాలిగపు వనమాల, రొండి రాజు, ఉపసర్పంచ్ బొడ్డు అరుణ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రావుకు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కేయూ మైక్రో బయాలజీ విభాగం పరిశోధకుడు నల్లపు శ్రీనివాస్‌రావుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. 'ఏ స్టడీ ఆన్ మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ బ్యాక్టీరియా అమాంగ్ ప్రెగ్నెంట్ ఉమెన్ అండ్ ఆల్టర్‌నేటివ్ థెరపీస్ ఫర్ యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్స్' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ ముంజం పర్యవేక్షణలో శ్రీనివాస్‌రావు తన పీహెచ్‌డీ పూర్తి చేశారు.

కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ సంబురాలు

● 'విద్యార్థి డీబార్'పై హైకోర్టు తీర్పు పట్ల హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థి హరీశ్, తదితరులు

కమలాపూర్ : జయహో బల్మూరి వెంకట్ అంటూ నినాదాలతో కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ శ్రేణులు ఆదివారం హోరెత్తించారు. పదో తరగతి ప్రశ్నపత్రం లీకైన క్రమంలో ఐదేళ్లపాటు డీబార్ అయిన విద్యార్థి హరీశ్ పరీక్ష రాసేలా హైకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సంబురాలు నిర్వహించారు. బాణాసంచా కాల్చి స్వీట్లు పంచారు. వెంకట్ చిత్రపటానికి విద్యార్థి హరీశ్ తండ్రి రాజుతో కలిసి క్షీరాభిషేకం చేశాడు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుండపు చరణ్ పటేల్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ పార్టీలు స్వార్థ రాజకీయాల కోసం కుట్రపూరితంగా ప్రశ్నపత్రాలు లీక్ చేస్తూ విమర్శలు చేసుకుంటూ అమాయక విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకైన విషయంలోనూ బీజేపీ, బీఆర్ఎస్ మోసపూరితంగా వ్యవహరించాయని గుర్తు చేశారు. నష్టపోయిన నిరుద్యోగ యువతకు ఇప్పటివరకు న్యాయం చేయలేదని మండిపడ్డారు. కేవలం అధికారంలోకి రావడమే లక్ష్యంగా బీజేపీ, బీఆర్ఎస్‌లు పరస్పర దూషణలు చేసుకుంటూ తప్పుడు పనులకు పాల్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మాత్రమే నిఖార్సైన ప్రజల పక్షపాతిగా నిలుస్తోందని చెప్పారు. టెన్త్ హిందీ ప్రశ్నపత్రం లీకైన ఘటనలో రెండు పార్టీలు కూడా హరీశ్ జీవితాన్ని పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. రాష్ట్ర విద్యాశాఖ హరీశ్‌ను ఐదేళ్ల పాటు డీబార్ చేయగా కాంగ్రెస్ నేతగా, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడుగా బల్మూరి వెంకట్ మాత్రమే కదిలి వచ్చాడని గుర్తు చేశాడు. హరీశ్ కుటుంబాన్ని ఓదార్చుతూనే హైకోర్టు నుంచి సానుకూల ఉత్తర్వులు సాధించే దిశగా వెంకట్ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల మోసపూరిత విధానాలను ప్రజలు గుర్తించాలని కోరారు.

వెంకట్‌కు రుణపడి ఉంటాం..

ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌కు రుణపడి ఉంటామని విద్యార్థి హరీష్, అతడి తండ్రి రాజు తెలిపారు. హరీష్‌ను విద్యాశాఖ ఐదేళ్లపాటు డీబార్ చేయగా బీజేపీ, బీఆర్ఎస్‌లు పట్టించుకోలేదని రాజు వాపోయాడు. వెంకట్ మాత్రమే తమకు అండగా నిలిచి తమ కొడుకు హరీష్ జీవితాన్ని బుగ్గిపాలు కాకుండా కాపాడాడని చెప్పారు. వెంకట్‌కు తన కుటుంబీకులంతా జీవితాంతం రుణపడి ఉంటామంటూ భావోద్వేగానికి గురయ్యాడు. కార్యక్రమాల్లో రాష్ట్ర కోఆర్డినేటర్ తొటం రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు దేశిని ఐలయ్యగౌడ్, నాయకులు వెంకన్న, కిరణ్, బాబు, రమేష్, రాజేశ్వర్‌రావు, నారాయణరెడ్డి, కొండ రమేశ్, కృష్ణమూర్తి, కనకరత్నం, ప్రసాద్, హనుమాన్ ప్రసాద్, రత్నం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే బీఆర్ఎస్ లక్ష్యం

● పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు : ప్రజల సంక్షేమం, అభివృద్ధే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు. పార్టీని మరింత బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మండలంలోని దామెర క్రాస్‌రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఆత్మకూరు, నాగయ్యపల్లె, అక్కంపేట, అగ్రంపహాడ్, చౌళ్లపెల్లి, లింగమడుగుపల్లె, పెద్దాపూర్, కామారం, తిరుమలగిరి, గూడెప్పాడ్, కొత్తగట్టు, మల్కపేట గ్రామాలకు చెందిన పార్టీ ముఖ్యనాయకుల, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ధర్మారెడ్డి హాజరై మాట్లాడారు. గత పాలకుల హయాంలో తెలంగాణ అన్ని రంగాల్లో వెనుకబడిపోగా స్వరాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రజల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. శ్రేణులకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందిస్తూ ఎదురులేని పార్టీగా బీఆర్ఎస్ దూసుకుపోతుండగా ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలతో ఉనికిని కాపాడుకునేందుకు తాపత్రయ పడుతున్నాయని చెప్పారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను, చేపడుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి, ఎంపీపీ మార్క సుమలత రజనీకర్, జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు, ఏఎంసీ చైర్‌పర్సన్ బొల్లెబోయిన రాధ రవియాదవ్, వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ డైరెక్టర్ దుంపల బుచ్చిరెడ్డి, రైతు సంఘం మండల కోఆర్డినేటర్ ఎన్కతాళ్ల రవీందర్, మాజీ జెడ్పీటీసీ రాజస్వామి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అంకూస్, నాయకులు వేముల నవీన్, సావురే రాజేశ్వర్‌రావు, వంగాల భగవాన్‌రెడ్డి, బీరం రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ గ్రామంలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్ ఆవరణలో 2002–03 పదో తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకుని ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులు సత్యనారాయణ, జె.లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్‌రావు, నిజామొద్దీన్, ఎడ్వర్డ్, కుమారస్వామి, మల్లేశ్ తమ అమూల్యమైన సందేశాలు అందించారు. అనంతరం తమకు చిన్ననాట విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూలమలుపుల్లో.. పొంచి ఉన్న ప్రమాదం





హెచ్చరిక బోర్డులు లేని మూలమలుపులు

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామం నుంచి ప్రగతిసింగారానికి వెళ్లే రోడ్డు పనులు పూర్తి చేసి ఏడాది గడుస్తున్నా ఆ దారిలోని మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు రాత్రివేళల్లో మూలమలుపులు తెలియక అనేక మంది వాహనాదారులు ప్రమాదాలకు గురవడమే కాకుండా మృత్యువాత పడుతున్నారు. దీంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూచిక బోర్డులు లేకపోవడంతో గతంలో వాహనదారులు మూలమలుపులు ఏర్పడక ప్రమాదానికి గురై మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. గతేడాది అక్టోబరు 6న పరకాలకు చెందిన యువకుడు ప్రగతిసింగారంలో ఉన్న స్నేహితుని వద్దకు వచ్చి అతడితో కలిసి పరకాలకు వెళ్తున్న క్రమంలో హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో మూలమలుపులోని వంతెన లోయలో బైకుతో సహ పడిపోయి ఒకరు మత్యువాత పడగా మరోకరికి కాలు విరిగి మంచాన పడాల్సిన పరిస్థితి ఎదురైంది. ఇలా చాలా మంది వాహనదారులు మూలమలుపుల్లో అదుపుతప్పి ప్రమాదాలకు గురౌతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూలుములుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



పత్తిపాక గ్రామం నుంచి ప్రగతి సింగారం గ్రామం వరకు చాల వరకు మూలమలుపులు ఎక్కువ ఉన్నాయి. మూలమలుపులు తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

- పొట్టకారి వికాస్

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



పత్తిపాక గ్రామం నుంచి ప్రగతి సింగారం గ్రామం వరకు నూతన డబుల్ రోడ్డు ఏర్పాటు చేయడంతో వాహనదారులు స్పీడ్‌గా వెళ్లడం వలన మూలమలుపులు గమనించక ప్రమాదాల బారినపడి మత్యువాత పడుతున్నారు. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు, మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలి.

- పరకాల దేవేందర్

వడుప్సా సభ్యుల సంక్షేమానికి కృషి

ఖిలా వరంగల్: వడుప్సా సభ్యుల సంక్షేమానికి మరింతగా కృషి చేస్తామని వడుప్సా ఖిలా వరంగల్ జోన్ నూతన అధ్యక్షుడు ముక్కెర రవీందర్, కార్యదర్శి దాసి సతీష్‌మూర్తి అన్నారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని టాలెంట్ హైస్కూల్ ప్రాంగణంలో నీసా జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జె.ఎస్.పరంజ్యోతి అధ్యక్షతన వడుప్సా ఖిలా వరంగల్ జోన్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథులుగా పరంజ్యోతి, కొమ్మినేని భూపాల్‌రావు, వెంకటేశ్వర రావు, ఆడెపు శ్యామ్, శ్రీధర్, బిల్లా రవి, జ్ఞానేశ్వర్ సింగ్ హాజరై నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సుధీర్, గోపు ప్రవీణ్, విశ్వనాథ్, ముల్కల శరత్‌బాబు, బండి అవినాష్, కుసురి శ్రీను, అగపాటి రాజు, కూచన కవిత, బండి చక్రపాణి, ఈసీలు ఎం.శ్రీధర్, సింగారపు రాజు, ఏఆర్‌వై.రాజు, కే.రవి, కనకయ్య, విలియం, మోహన్, డెల్లా శ్రీను, వెంకట్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.